క్లుప్తంగా

క్యాలెండర్లు ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క

టేకులపల్లి: తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి దనసరి సీతక్క టీఎస్‌ఏటీఎఫ్ క్యాలెండర్లు ఆవిష్కరించారు. ఈ మేరకు టీఎస్ ఏటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు టేకులపల్లికి చెందిన మోకాళ్ల శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ములుగులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం సంఘం క్యాలెండర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కబ్బాకుల రవి, కుర్సం అంజయ్య, కుంజ కృష్ణ, ఉండం నాగేందర్‌రావు, మోకాళ్ల రామచంద్రు, కోరం సంతోష్, వాసం నాగేశ్వరరావు, చందా రఘుపతి, చాపల రమేష్ బాబు, సిద్ధబోయిన భిక్షం తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు ఏరియాలో...



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న జాన్ ఆనంద్

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం కార్యాలయంలో సింగరేణి నూతన సంవత్సరం క్యాలెండర్లను శనివారం జీఎం జాన్ ఆనంద్ ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. సింగరేణీయులకు ప్రేరణ కలిగేలా సంస్థ సాధిస్తున్న బహుముఖ ప్రగతికి సంక్షేమానికి సామాజిక సేవకు ప్రతీకగా ఈ క్యాలెండర్ రూపొందించబడిందన్నారు. ఈ క్యాలెండర్ ప్రతీ ఉద్యోగిలో నూతన ఆనందాన్ని నింపుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, అధికారులు నర్సింహారాజు, జీవీ మోహన్‌రావు, బాలాజీనాయుడు, రవికుమార్, అంజిరెడ్డి, మధుబాబు, సాయి స్వరూప్ పాల్గొన్నారు.

కొత్తగూడెం ఏరియాలో...



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఏరియా జీఎం శాలెంరాజు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ 2024 క్యాలెండర్లను శనివారం కొత్తగూడెం ఏరియా జీఎం ఎం శాలెంరాజు ఆయన కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నూతన సంవత్సరంలో ప్రతీ ఒక్కరికి మంచి జరగాలని, ప్రధానంగా ఉద్యోగులు సంస్థ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేస్తూ సంస్థను లాభాల్లో నడిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సీఎండీకి శుభాకాంక్షలు



బలరామ్‌ను అభినందిస్తున్న బీఎంఎస్ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి నూతన సీఎండీగా బాధ్యతలు చేపట్టిన ఎన్.బలరామ్‌ను జాతీయ బొగ్గు గనుల ఇన్‌చార్జ్ జేబీసీసీఐ సభ్యులు కొత్తకాపు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో శనివారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణికి రావాల్సిన సుమారు రూ.29 వేల కోట్లు వసూలు చేయాలని, సంస్థకు సంబంధించిన కొత్త గనుల ఏర్పాటుకు కృషి చేయాలని, సంస్థలో పెండింగ్‌లో ఉన్న అలియాస్ పేర్లు మార్పిడి, ఇతర సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కారించాలని కోరారు. పి.మాధవ నాయక్, ఏబీకేఎంఎస్, ఎస్‌సీఎంకేఏస్ కోర్ కమిటీ సభ్యులు ఉన్నారు.

చిన్నారులకు వైద్యపరీక్షలు



పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

జూలూరుపాడు: పడమటనర్సాపురం కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు మనోజ్‌కుమార్, నజరీన్ తబసమ్‌లు వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఆరు గ్యారంటీలు అందిస్తాం..

- ఎమ్మెల్యేలు కూనంనేని, కనకయ్య
- ముగిసిన ప్రజాపాలన గ్రామసభలు



టేకులపల్లి: బోడు గ్రామంలో దరఖాస్తులు అందజేస్తున్న ప్రజలు

చుంచుపల్లి: కొత్త ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న గ్యారంటీ పథకాలు పేదల కుటుంబాల్లో వెలుగులు నింపుతాయని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం చుంచుపల్లి మండలం పెనగడప గ్రామపంచాయతీలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో అయన పాల్గొన్నారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడారు. ప్రతీ దరఖాస్తు విలువైదని, పొరపాట్లు జరగకుండా ఆన్‌లైన్‌లో డేటా నమోదు చేయాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో వివక్ష ఉండదని, పథకాల పంపిణీ పారదర్శకంగా ఉంటుందన్నారు.

సభలను విజయవంతంగా నిర్వహించిన అధికార యంత్రాంగానికి, సహకరించిన స్థానిక ప్రజా ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. సభలో అగ్రికల్చరల్ ఏఓ రాజేశ్వరి, గ్రామ కార్యదర్శి హనుమంతు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, ఎంపీటీసీ అచ్చ నాగమణి, ఉప సర్పంచ్ కట్ట సంతోష్ పాల్గొన్నారు.

కొత్తగూడెంరూరల్: ఆరు గ్యారంటీ ప్రభుత్వ పథకాలకు లక్ష్మీదేవిపల్లి మండలంలో 12,092 ఇళ్లు ఉండగా 12,634 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓ రమేష్ శనివరాం తెలిపారు.

పాల్వంచరూరల్: మండలంలో 36 గ్రామపంచాయతీల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకై నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజలు మొత్తం 13,950 దరఖాస్తులు అందజేసినట్లు ఎంపీడీఓ అప్పారావు తెలిపారు.

జూలూరుపాడు: ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలు కోసం గత నెల 28వ తేదీ నుంచి నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామసభలు శనివారం ముగిశాయి. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో ఎనిమిది రోజులు జరిగిన ప్రజాపాలన గ్రామసభల్లో 11,852 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే ఆన్‌లైన్ నమోదు మొదలైంది. చివరిరోజు పాపకొల్లు, వెంగన్నపాలెం, కాకర్ల, చింతలతండా గ్రామాల్లో గ్రామసభలు ప్రశాంతంగా ముగిశాయి. ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ శారద, ఏఓ ఎస్.రఘుదీపిక, ఎంపీఓ తులసీరామ్, ఏఎస్ఓ నరసింహారావు, ఐటీడీఏ ఏఈ మీనా, సెర్ప్ ఏపీఎం సత్యనారాయణరాజు, గిర్దావర్ తిరుపతిరావు, జేవీఓ పూర్ణచందర్‌రావు, ఏఈఓలు గోపీకృష్ణ, గౌస్, సరితదేవి, లావణ్య పాల్గొన్నారు.

ఇల్లెందు: ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు కోసం గ్రామసభలు నిర్వహించింది. గత నెల 28వ తేదీ నుంచి 30 వరకు, జనవరి 2 నుంచి 6 వరకు మొత్తం ఆరు రోజులు గ్రామ సభలు నిర్వహించారు. పట్టణంలోని 24 వార్డులలో 9,415 గృహాలు ఉండగా 10,373 దరఖాస్తులు వచ్చాయి. మూడు రోజులుగా మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్నారు. ఇప్పటి వరకు ఆరు వార్డుల అన్‌లైన్ ప్రక్రియ కూడా ముగిసింది. మరో వారం రోజుల్లో ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసే అవకాశం ఉందని మున్సిపల్ కమిషనర్ నవీన్ శనివారం విలేకరులకు తెలిపారు. గ్రామసభల్లో ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: అర్హులైన ప్రతీఒక్కరికి ఆరు గ్యారెంటీలు పక్కాగా అందిస్తామని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండలంలోని ఒడ్డుగూడెం గ్రామ పంచాయతీలో శనివారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ దరఖాస్తుపై సమగ్ర విచారణ ఉంటుందన్న విషయాన్ని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించిందని గుర్తుచేశారు. గతంలో మాదిరిగా సంక్షేమ పథకాల అమలు కోసం ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఎవరైనా వసూలు చేసినట్లు తెలిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఒడ్డుగూడెం గ్రామపంచాయతీకి అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని, ప్రజలంతా ఐక్యంగా ఉంటూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను సద్వినియోగ చేసుకోవాలని కోరారు. అనంతరం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. సభలో సర్పంచ్ చాట్ల భాగ్యమ్మ, తాటి చుక్కమ్మ, ఎంపీడీఓ బాలరాజు, పంచాయతీ కార్యదర్శి మల్లేష్ పాల్గొన్నారు. మండలంలోని 29 గ్రామపంచాయతీల పరిధిలో ప్రజాపాలన గ్రామసభల్లో మొత్తం 23,491 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓ బాలరాజు తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా మొత్తం 23,491 దరఖాస్తులు అందజేశారని చెప్పారు.

టేకులపల్లి: ప్రజాపాలన గ్రామసభలు శనివారం ముగిశాయి. చివరి రోజు మండలంలోని దాసుతండా, టేకులపల్లి, సులానగర్, తడికలపూడి, కొప్పురాయి, బోడు పంచాయతీల్లో గ్రామసభలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో మొత్తం 36 గ్రామ పంచాయతీల్లో 15,464 నివాసాలు ఉండగా 16,816 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ కోట వీరబాబు తెలిపారు.



చుంచుపల్లి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని



ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం



నందాతండాలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీపీ, మండలాధికారులు



ఇల్లెందు: 24వ వార్డులో గ్రామసభలో దరఖాస్తులు తీసుకుంటున్న అధికారులు



జూలూరుపాడు: చింతలతండాలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ శారద

వ్యాపారుల మనుగడ కాపాడాలి..



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న వ్యాపారుల సంఘం నాయకులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణంలో ప్రశ్నార్థకంగా మారుతున్న స్థానిక వ్యాపారుల మనుగడ కోసం ఓ బృహత్తర ప్రణాళిక రూపొందించాలని కొత్తగూడెం పట్టణ చిరు వ్యాపారులు, వ్యాపార సంఘాలు, నాయకుల ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్పొరేట్ సంస్థలు, ఆన్‌లైన్ వ్యాపారాల వల్ల కొత్తగూడెం పట్టణంలో స్థానిక వ్యాపారులు, చిరు వ్యాపారుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని వాపోయారు. కొత్తగూడెం భవిష్యత్ బాగుండాలంటే పట్టణం సుందరీకరణ చేపట్టడంతో పాటు పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఉన్న ఖాళీ స్థలంలో వ్యాపార సముదాయాలను ఏర్పాటు చేయాలని కోరారు. కొత్తగూడెం నుంచి హైదరాబాద్‌కు రాకపోకల సాగించే వారి కోసం గతంలో రద్దైన రైళ్లను పునరుద్ధరించి, కొత్తగా మరో రెండు రైళ్ల నడిచే విధంగా చూడాలని కోరారు. సింగరేణి స్థలాల్లో ఉన్న నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్తగూడెం పట్టణంలో ఉన్న నాలుగు ప్రధాన రహదారులను డబుల్ లేన్ రోడ్లుగా మార్చి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. కూరగాయలు, ఫ్రూట్స్ అండ్ ఫ్లవర్స్ మార్కెట్లను మరింత అభివృద్ధి చేయడంతో పాటు ఫుడ్‌కోర్టును ఏర్పాటు చేయాలని సూచించారు. ఇండస్ట్రియల్ పార్క్, ఐటీ హబ్ ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పరిచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. శిథిలావస్థకు చేరిన సింగరేణి కాంప్లెక్స్‌ల స్థానంలో నూతన షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్మించాలని కోరారు. తద్వారా కొత్తగూడెంలో వ్యాపారాలు విస్తరించేందుకు, పట్టణం మరింత అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కొత్తగూడెం స్థానిక వ్యాపార సంఘం నాయకులు మొరిశెట్టి భవానిప్రసాద్, తాటిపల్లి శంకర్‌బాబు, అబీద్, పల్లపోతు శ్రీనివాసు, గునిపాటి ఆనంద్, మొరిశెట్టి నరసింహారావు, రాజ్ జకోటియా, అనూప్ ఖండేల్వాల్, మొరిశెట్టి అనీష్ కుమార్ తదితరులు ఉన్నారు.

వృత్తి విద్యా కోర్సులను సద్వినియోగం చేసుకోండి



హాజరైన సింగరేణి అధికారులు, సేవా సభ్యులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మిక కుటుంబాలకు చెందిన ప్రభావిత ప్రాంత మహిళలు సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృత్తి విద్యా కోర్సులను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని జీఎం పర్సనల్ (వెల్ఫేర్) కట్టా బసవయ్య అన్నారు. శనివారం కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా సేవా సమితి ఆధ్వర్యంలో సింగరేణి ఉన్నత పాఠశాలలో ఎంసీ క్వార్టర్స్‌లో నిర్వహించనున్న ఉచిత బ్యుటీషియన్, స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ తరగతుల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా జీఎం హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సింగరేణి కార్మిక కుటుంబాలకు చెందిన మహిళలు, పరిసర ప్రాంత మహిళలు సేవా సెంటర్లలోని శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నైపుణ్యం సంపాదించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనికేషన్ ఆఫీసర్ టి.శ్రీనివాస్‌రావు, సేవా కోఆర్డినేటర్ సుజాత, దీప, స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షకురాలు ఎస్.పారిజాత, ఫర్హాన తదితరులు పాల్గొన్నారు.

ఫాతిమాషేక్ జయంతి నిర్వహించాలి

కొత్తగూడెంఅర్బన్: భారతదేశ మొట్ట మొదటి ముస్లిం మహిళా విద్యావేత్త ఫాతిమా షేక్ జయంతి వేడుకలను రాష్ట్ర వ్యాప్తంగా మైనారిటీ గురుకులాలతో పాటు ఉర్దూ మీడియం విద్యా సంస్థల్లో అధికారికంగా నిర్వహించాలని జిల్లా మైనారిటీ అధ్యక్షుడు ఎండీ యాకూబ్‌పాషా కోరారు. ఈమేరకు శనివారం మైనారిటీ గురుకులాల కార్యదర్శి ఆయేషా మస్రత్ ఖనంకు లేఖ అందజేశారు. సావిత్రీబాయిపూలేతో కలిసి అణగారిన వర్గాల మహిళలకు, పిల్లలకు అక్షర జ్ఞానాన్ని ప్రసాదించి, భారతదేశ మొట్ట మొదటి ముస్లిం ఉపాధ్యాయురాలుగా పేరు ప్రఖ్యాతలు గడించిందని పేర్కొన్నారు. ఫాతిమాషేక్ జయంతి వేడుకలను జనవరి 9న ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు.

'శ్రీరాగా'లో బెలూన్ బేబీ షో



విద్యార్థులతో ఉపాధ్యాయులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మేదరబస్తీలోని శ్రీరాగా ప్లే స్కూల్‌లో శనివారం బెలూన్ బేబీ షో ఘనంగా నిర్వహించారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తల్లిదండ్రులు వారి చిన్నారులను ఫ్యాన్సీ డ్రెస్సులు, రంగురంగుల బెలున్లతో, నూతన దుస్తులతో చిన్నారులను తీసుకొచ్చారు. ప్లే స్కూల్ ఉపాధ్యాయులు చిన్నారులతో ఆటపాటలతో గడిపి బెలూన్లతో ఆటలు ఆడించారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో యాజమాన్యం మల్లారపు వరప్రసాద్, కవిత, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జంతువులను వేటాడడం చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న ఎఫ్ఆర్ఓ ప్రసాద్‌రావు

జూలూరుపాడు: అడవి జంతువులను వేటాడడం, అడవులు నరకడం, ఆక్రమణలకు పాల్పడం చట్టరీత్యా నేరమని జూలూరుపాడు ఎఫ్ఆర్ఓ జి.ప్రసాద్‌రావు అన్నారు. శనివారం నల్లబండ బోడు గ్రామంలో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. అడవులు తరిగిపోవడం, చెట్లు నరకడం, వ్యవసాయం కోసం పోడు నరకడం, అగ్నిప్రమాదంతో కాలిపోతే పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణ కోసం అటవీశాఖ చర్యలు తీసుకుంటోందని, దీనికి ప్రజలంతా సహకరించాలన్నారు. అటవీ నేరాలకు పాల్పడితే ఎలాంటి చట్టాలు, శిక్షలు ఉంటాయో ప్రజలకు వివరించారు. అడవులకు ఎలాంటి నష్టం కలిగించే చర్యలకు పాల్పడబోమని గ్రామస్తులతో అటవీశాఖాధికారులు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గుండెపుడి డీఆర్ఓ లక్ష్మీనర్సు, గుండెపుడి, నల్లబండబోడు బీట్ ఆఫీసర్లు డి.కిషన్, జె.కిషన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ పరిధి హనుమాన్ బస్తీలో కుక్కలు సంతతి బాగా పెరిగిపోయింది. రోజూ ఎవరో ఒకరి మీద దాడి చేస్తున్నాయి. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. హనుమాన్‌బస్తీకి చెందిన చింతకాయల బాలనర్సయ్య శనివారం కిరణా షాపుకు వెళ్లి వస్తుండగా మూడు కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. అక్కడి స్థానికులు కుక్కలను చెదరగొట్టి నర్సయ్యను కాపాడారు. వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీధి కుక్కల దాడుల నుంచి ప్రజలను రక్షించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

ఎస్పీ రోహిత్‌రాజ్‌కు శుభాకాంక్షలు

సింగరేణి(కొత్తగూడెం): ఎస్పీ బిరుదారాజు రోహిత్ రాజ్‌ను జిల్లా కాంగ్రెస్ నాయకులు మోత్కూరి ధర్మారావు శనివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతలు కాపాడాలని, జిల్లా సరిహద్దులో ఉన్న ఉగ్రవాద కార్యకలాపాలపై దృష్టి సారించాలని కోరారు. అంతేకాకుండా జిల్లాలో గంజాయి రవాణా జోరుగా సాగుతున్న తరుణంలో యువత వాటిపై దృష్టి సారించకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. యువత చెడు వ్యసనాలకు బానిన పడకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని విన్నవించారు.

బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనండి..

సింగరేణి(కొత్తగూడెం): నూతన బొగ్గు బ్లాకుల కోసం కేంద్రం నిర్వహించే బొగ్గు బ్లాకుల వేలంలో సింగరేణి సంస్థ పాల్గొనాలని ఏఐటీయూసీ నాయకులు శనివారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు లేఖ రాసినట్లు ఆ కార్మిక సంఘం నాయకులు దమ్మాలపాటి శేషయ్య తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... వేలంలో పాల్గొనకపోతే సంస్థకు గనులు వచ్చే అవకాశం లేదని, గత ప్రభుత్వం ఇలాంటి తప్పిదాలు చేసే సంస్థకు చెందిన రూ.కోట్లు వెచ్చించి సర్వే చేసిన గనులను పొందలేక పోయిందని, తద్వారా సంస్థకు బొగ్గునిక్షేపాలు కరువయ్యాయన్నారు. గోదావరి పరివాహక ఉన్న బొగ్గు క్షేత్రంలో 1931 నుంచి సింగరేణి సంస్థ ఆనాటి నిజాం ప్రభుత్వం మంజూరుతో బొగ్గు తవ్వకాలను ప్రారంభించిందని, ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎంఎండీఆర్ చట్టం వేలం ద్వారా బొగ్గు బ్లాకులను దక్కించుకోవాలన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సర్పంచ్ సరోజిని

ఇల్లెందురూరల్: కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న ఉపాధి హామీ పథకాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని పోలారం సర్పంచ్ వాంకుడోత్ సరోజిని అన్నారు. పోలారం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ గ్రామసభను శనివారం నిర్వహించారు. ఏడాది కాలంగా గ్రామపంచాయతీ పరిధిలో చేపట్టిన పనులను సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయి స్థాయిలో పర్యటించి తనిఖీలు నిర్వహించింది. ఆయా నివేదికలను తనిఖీ బృందం సభ్యులు గ్రామసభలో చదివి వినిపించారు. లోపాలను సభ దృష్టికి తీసుకొచ్చి వివరణ కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ సరోజిని మాట్లాడుతూ.. గ్రామపంచాయతీకి మంజూరైన పనిదినాలలో సగం రోజులు కూడా కూలీలు పనికి హాజరు కాలేదని వాపోయారు. గతంలో కూలీల హాజరులో పోలారం ముందు వరుసలో ఉండేదని గుర్తుచేశారు. ఉపాధి హామీ సిబ్బంది పనులపై కూలీలకు అవగాహన కల్పించి పనులకు హాజరయ్యేలా ప్రోత్సహించాలని కోరారు. సమావేశంలో గ్రామపంచాయతీ కార్యదర్శి ఉప్పు దీప్తి, ఏపీఓ శంకర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

టేకులపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. టేకులపల్లి మండలం బిల్లుడు తండాకు చెందిన కోటేశ్ శనివారం రాత్రి లాలు తండా సమీపంలో ఒంటరిగా రోడ్డు దాటుతుండగా వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ఘటనలో కోటేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆటోలో కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

దినచర్యలకు అక్షర రూపం

- డైరీలకు తగ్గని ఆదరణ
- దైనందిన జీవితంలో ఒక భాగం
- కొత్త రూపాల్లో మార్కెట్‌లో లభ్యం



సుజాతనగర్: దినచర్యలను, అనుభవాలను అక్షర రూపంలో పుటల్లో పేర్చితే డైరీ అది అవుతుంది. మనసు స్పందించే ప్రతీ భావాన్ని, ప్రతీ సంఘటననూ, ప్రతీ ఆలోచనను తనలో నిక్షిప్తం చేసుకునే అపురూప పుస్తకమే డైరీ. అందుకే ఇంటర్నెట్, యాండ్రాయిడ్ మొబైళ్లు అందుబాటులోకి వచ్చినా డైరీ ప్రాధాన్యం తగ్గలేదు. తీపి, చేదు సమ్మిళిత అనుభవాలతో ఎప్పటిలానే మరో సంవత్సరం ముగిసిపోయింది. 2024లో కొంగొత్త జ్ఞాపకాలను దాచుకోవడానికి వివిధ కళాకృతులతో మార్కెట్లో డైరీలు అమ్మకానికి ఉన్నాయి.

సరికొత్త రూపాల్లో స్వాగతం...

సరికొత్త రూపాల్లో డైరీలు స్వాగతం పలుకుతున్నాయి. దుకాణాలలో డిసెంబర్ నెలాఖరు నుంచే డైరీల కొనుగోళ్లు మొదలయ్యాయి. ప్రధాన పట్టణాలలోని పుస్తక విక్రయ దుకాణాలతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లోని షాపుల్లోనూ డైరీలు అమ్ముతున్నారు. మార్కెట్‌లో రూ.100 నుంచి రూ.500 విలువ చేసే డైరీలు లభ్యమవుతున్నాయి. వీటిని స్థానిక దుకాణదారులు హైదరాబాద్, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్నారు.



మనస్సాక్షికి ప్రతీక...

డైరీ మనస్సాక్షికి ప్రతీక. డైరీ రాయడమంటే మనలను మనం సరిచేసుకోవడమే. టెక్నాలజీ పేరుతో రోజుకో సరికొత్త యాప్‌లు, ఫేస్‌బుక్‌లు, వాట్సాప్‌లు, కంప్యూటర్లు, రావడంతో ప్రజల్లో కొంతమేర డైరీ రాసే అలవాటు తగ్గుతోంది. డైరీ రాయడం వలన ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని విద్యావేత్తలు, మానసిక విశ్లేషకులు చెబుతున్నారు. నిత్యజీవితంలో జరిగే కార్యకలాపాలు, గత అనుభవాలు, గడిచిన విషయాలు గుర్తు చేసుకోవడం, ముఖ్యమైన తేదీలు, ఆర్థిక లావాదేవీలు తదితర వాటికి డైరీ ఎంతో ఉపయోగపడుతుంది. డైరీలో రాసిన అంశాలను అప్పుడప్పుడు సమీక్షించుకుంటే మనం చేసిన తప్పుఒప్పులను సరిదిద్దుకోవచ్చు.

వ్యక్తిగత డైరీలు...

ఒక వ్యక్తికి సంబంధించిన డైరీపై పూర్తి హక్కులు అతడికే ఉంటాయి. నిత్యజీవితంలో జరిగిన సంఘటనలన్నీ రాత్రివేళ అందులో లిఖిస్తారు. ముఖ్యమైన విషయాలు, తీపి జ్ఞాపకాలను అందులో పొందుపరుచి ఖాళీ సమయాల్లో వాటిని నెమరువేసుకుంటారు.

ప్రొఫెషనల్ డైరీలు...

వృత్తిపరంగా బాధ్యతలు అధికంగా ఉండే వారు క్రమం తప్పకుండా ఉపయోగించే వాటిని ప్రొఫెషనల్ డైరీలు అంటారు. పోటీ ప్రపంచంలో ప్రొఫెషనల్ డైరీ ఒక పర్సనల్ అసిస్టెంట్‌గా సహకరిస్తుంది. దైనందిన వ్యవహారాలను మర్చిపోకుండా, సమయానుకూలంగా చేయాల్సిన పనులను గుర్తు చేస్తుంది. ప్రముఖ తేదీలు, ప్రయాణాలను పొందుపరచుకోవచ్చు.


అనుభవాలను నెమరువేసుకోవచ్చు



డైరీ రాయడం ఎప్పటి నుంచో అలవాటు. గత అనుభవాలు నెమరవేసుకోవడానికి డైరీ ఎంతగానో ఉపకరిస్తుంది. మర్చిపోయిన విషయాలను డైరీని చూసి తెలుసుకోవచ్చు. ప్రతీరోజు డైరీ రాయనిదే నిద్రపోను. దినచర్యలను రాసుకోవడం నాకు అలవాటుగా మారింది.

– వి.దుర్గాప్రసన్న, ప్రిన్సిపాల్, శ్రీవాణి నికేతన్, సుజాతనగర్

డైరీ రాయడం మంచి అలవాటు..



డైరీ రాయడం మంచి అలవాటు. డైరీని రాయడంతో మన జీవితంలో జరిగే ప్రతి సంఘటనను ఎప్పటికైనా తిరిగి గుర్తు చేసుకోవచ్చు. కంప్యూటర్లు, ల్యాప్‌టాపులు, సెల్‌ఫోన్లు ఎన్ని ఉన్నా డైరీకి మించిన ప్రత్యామ్నాయం లేదు. నేను ప్రతిరోజూ రాస్తుంటా.

– జి.శిరీష, తహసీల్దార్, సుజాతనగర్

వ్యక్తిత్వ వికాసానికి దోహదం..



వ్యక్తిత్వ వికాసానికి డైరీ ఎంతో ఉపయోగపడుతుంది. డైరీలు రాయడం వలన లక్ష్యసాధన సులభమవుతుంది. గత జ్ఞాపకాలు మనలో వచ్చే మార్పులు బేరీజు వేసుకోవడానికి డైరీ ఎంతో ఉపయోగపడుతుంది. చదువుకున్న వాళ్లందరూ డైరీ రాయడం అలవాటు చేసుకోవాలి.

– ఎం.సోమేశ్వర్, ఎస్సై, సుజాతనగర్